సాక్షి వరంగల్

శనివారం | 25 | మే | 2024



అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలు

కాజీపేట జంక్షన్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డీఆర్‌ఎం భర్తీష్‌కుమార్ జైన్ తెలిపారు. - 8లో▸



కేసీఆర్ కుటుంబమే పెద్ద బ్లాక్‌మెయిలర్

కేసీఆర్ కుటుంబం కంటే పెద్ద బ్లాక్ మెయిలర్ రాష్ట్రంలో ఎవరూలేరని మంత్రి సీతక్క అన్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
42°/31°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయంలో వేడి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ఖానాపురం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని డీఆర్డీఓ కౌసల్యా దేవి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రం, ధర్మరావుపేట గ్రామాల్లో విద్యార్థులకు శుక్రవారం యూనిఫాం పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవడానికి ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీలు కీలకంగా పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన తీరును వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఎం దయాకర్, ఏపీఎం కందిక సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతి లేని స్కూళ్లపై చర్య తీసుకోవాలి



కాశోజీ సెంటర్ : నగరంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు డీఈఓ వాసంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ ఉమ్మడి జిల్లా నాయకుడు మోహన్ మాట్లాడుతూ శివనగర్‌లోని ఏకశిల ఈటెక్నో స్కూల్ అనుమతి లేకుండా సీబీఎస్‌ఈ బోర్డు తగిలించుకుని లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తోందని ఆరోపించారు. తక్షణమే ఇలాంటి పాఠశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని సీబీఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్తానని డీఈఓ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, వినయ్, సతీశ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



గీసుకొండ: మండలంలోని మనుగొండకు చెందిన నమిండ్ల భాస్కర్ (50) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. భాస్కర్ ఈ నెల 23న మధ్యాహ్నం పశువులను మేపడానికి వెళ్లి రాత్రి వరకు తిరిగిరాలేదు. శుక్రవారం ఉదయం వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించారు. మనుగొండ శివారులోని ఎంబాడి పరమేశ్వర్ వ్యవసాయ భూమిలోని టేకు చెట్టు కింద చనిపోయి ఉన్నాడు. చీమలు కరవడంతో లేదంటే వడదెబ్బ, ఇతర అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉంటాడని మృతుడి కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గీసుకొండ ఎస్సై షేక్ జానీపాషా తెలిపారు.

బండరాయి మీదపడి రైతు దుర్మరణం

రాయపర్తి: బావిలో విద్యుత్ మోటారును మరమ్మతు చేస్తుండగా బండరాయి మీదపడి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కిష్టాపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మూన్యానాయక్ (59) తన వ్యవసాయ బావిలోని మోటారును వల్లపు ఐలయ్య, రాపాక నరేశ్‌తో కలిసి మరమ్మతు చేస్తున్నాడు. ఈ క్రమంలో మోటారు ఫుట్‌వాల్‌కు ఉన్నతాడు పైన ఉన్న రాయికి తగిలి మూన్యానాయక్‌పై పడింది. ఈ క్రమంలో మూన్యానాయక్ వెంటనే బావిలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై వద్దే సందీప్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేటకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పిటిషన్ రాగానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

గీసుకొండ : మండల కేంద్రంలో పాకనాటి చిన్న సమ్మయ్య పాడిగేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. గురువారం రాత్రి ఈదురుగాలులు, వర్షానికి చెట్టు కూలి కరెంట్ తీగలపై పడింది. శుక్రవారం గేదె మేసుకుంటూ వెళ్తూ కింద పడిన తీగలు తగిలి షాక్‌తో అక్కడే మృతి చెందింది. సుమారు రూ.80 వేల విలువైన పాడిగేదె మృతిచెందిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

హరితహారానికి సన్నద్ధం

- జిల్లాలో పదో విడతకు అధికారుల ఏర్పాట్లు
- 32.70 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- 327 నర్సరీల్లో పెంచుతున్న అధికారులు
- పండ్లు, పూలు, నీడనిచ్చే వాటికి ప్రాధాన్యం



నెక్కొండ మండలంలోని చిన్నకొర్పోలు నర్సరీలో పెంచుతున్న మొక్కలు

నెక్కొండ: కనుమరుగవుతున్న అడవులు, పెరుగుతున్న కాలుష్యంతో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ తరుణంలో విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందుకోసం ఏటా వేసవిలో రూ.లక్షలు వెచ్చించి నర్సరీల్లో మొక్కలు పెంచుతోంది. వాటిని వర్షాకాలంలో నాటించి పచ్చదనం పెంపొందించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆ దిశగా పదో విడత హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకు ఆయా ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. ఆ ప్రకారం మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించారు.



80 రకాల మొక్కలు సిద్ధం..

ఇప్పటికే జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 32.70 లక్షల మొక్కలు నాటేందుకు అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు జిల్లా వ్యాప్తంగా 327 నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత అనుభవాలను స్ఫూర్తిగా తీసుకొని ఈ ఏడాది 70 నుంచి 80 రకాల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. పలు రకాల పూల మొక్కలతోపాటు పండ్లు, నీడనిచ్చే మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు.

నర్సరీల్లో మొక్కల సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

హరితహారం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకొని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎండ నుంచి సంరక్షించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సరీలకు షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయడంతోపాటు రోజుకు రెండు సార్లు నీటిని అందిస్తున్నారు. ఈ ఏడాది అన్ని నర్సరీలు డీఆర్‌డీఓ, అటవీశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఆయా నర్సరీలను పరిశీలించి క్షేత్రస్థాయిలో అధికారులకు తగు సూచనలిస్తున్నారు. విద్యాసంస్థలు, వసతిగృహాలు, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటనున్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కను బతికించేందుకు సమష్టి కృషి చేస్తున్నారు.

నర్సరీల్లో పెంపకం ఇలా...

జిల్లాలోని 323 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా 327 నర్సరీలు ఏర్పాటు చేశారు. పంచాయతీకి ఒక నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపడుతున్నారు. ఒక్కో నర్సరీ లో సుమారు 10 వేల మొక్కలు పెంచుతున్నారు. ఇందుకోసం నర్సరీకి సుమారు రూ.1.40 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. నర్సరీల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతను పంచాయతీలకు అప్పగించారు.

ప్రతీ మొక్కను సంరక్షిస్తాం..



హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు ఇప్పటికే ప్రణాళిలు రూపొందించాం. జిల్లాలోని 327 నర్సరీల్లో 32.70 లక్షల మొక్కలు పెంచుతున్నాం. హరితహారం కార్యక్రంలో భాగంగా నాటునున్న ప్రతి మొక్కనూ సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో హరితహారం లక్ష్య సాధనకు కృషి చేస్తాం.

- కౌసల్యాదేవి, డీఆర్‌డీఓ

శాఖలవారీగా నాటనున్న మొక్కల వివరాలు

శాఖ	నాటనున్న మొక్కలు
పంచాయతీ రాజ్	7,00,000
డీఆర్‌డీఓ	6,14,250
పట్టుపరిశ్రమ	80,000
నర్సంపేట మున్సిపాలిటీ	1,08,500
వ్యవసాయ శాఖ	1,00,000
అటవీ	50,000
వర్ధన్నపేట మున్సిపాలిటీ	90,000
ఎక్సైజ్	95,000
ఉద్యాన	82,750
గనులు, భూగర్భ వనరులు	8,400
పశుసంవర్ధక	38,400
విద్యాశాఖ	50,000
పౌరసరఫరాలు	5,000
పరిశ్రమలు	6,000
వ్యవసాయ మార్కెటింగ్	3,000
జిల్లా సహకార శాఖ	3,150
మత్స్యశాఖ	1,000
సంక్షేమ శాఖ	3,500
వైద్య, ఆరోగ్య	2,000
మైనార్టీ సంక్షేమం	500
గిరిజన సంక్షేమం	1,400
బీసీ సంక్షేమం	1,000
ఎస్సీ సంక్షేమం	500
గ్రేటర్ వరంగల్	5,00,000
నీటిపారుదల	39,200
శాఖలకు అదనంగా	6,86,450
మొత్తం	32.70 లక్షలు

వెబ్‌సైట్‌లో పోలింగ్ కేంద్రం వివరాలు

కాశోజీ సెంటర్ : వరంగల్–నల్లగొండ–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక కోసం ఓటు హక్కు నమోదు చేసుకున్న వారు ఈసీ వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నమోదు చేసుకున్న పట్టభద్రులకు ఓటరు స్లిప్పులు అందించామని పేర్కొన్నారు. ఓటరు స్లిప్పులు అందని పట్టభద్రులు http://ceotelangana.nic.inలో చూసుకోవచ్చని తెలిపారు. ఈ వెబ్‌సైట్‌లో ఓటు హక్కుతోపాటు పోలింగ్ కేంద్రం తదితర వివరాలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ గడువు

ఎమ్మెల్సీ ఉపఎన్నిక విధులు నిర్వర్తించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే గడువు శుక్రవారం ముగిసిందని కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని ఎల్‌బీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో శుక్రవారం 143 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నేటితో ప్రచారానికి తెర..

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారానికి శనివారం సాయంత్రం 4 గంటలకు తెర పడనుందని కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. నేటి సాయంత్రం 4 నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు (సైలెన్స్ పీరియడ్) పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎలాంటి బల్క్ ఎస్‌ఎంఎస్‌లు పంపించకూడదని, ఒకవేళ ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే ఈసీ నిబంధనల మేరకు చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సైలెన్స్ పీరియడ్‌లో ఎలాంటి బల్క్ ఎస్‌ఎంఎస్‌లు పంపకూడదని కలెక్టర్ సూచించారు.

27న 144 సెక్షన్ : సీపీ

వరంగల్ క్రైం: వరంగల్–నల్లగొండ–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఈనెల 27న 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నిక సందర్భంగా కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించేందుకు ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా కమిషనరేట్ పరిధిలో బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధమని, ఎన్నికల వేళ పోలింగ్ కేంద్రాల చుట్టూ గుమిగూడరాదని, పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల హద్దును దాటి ఓటర్లు తప్ప ఎవరూ లోపలికి రావొద్దని సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి పోలీస్ అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

ప్రధాని మోదీతోనే ఆర్థికాభివృద్ధి

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల

నర్సంపేట: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో భారత్ ఆర్థికాభివృద్ధి సాధించిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో భారతదేశ ప్రజలకు ఉచితంగా వ్యాక్సిన్ అందించడమే కాకుండా ప్రపంచ దేశాలకు అందించి మానవత్వం చాటుకున్నారని తెలిపారు. ఆర్టికల్ 370 రద్దుతో నేడు కశ్మీర్ పర్యాటకంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. సైన్యానికి భరోసాగా నిలిచిన గొప్ప ప్రధాని మోదీ అని కొనియాడారు. ఒకప్పుడు భారత్.. పాకిస్థాన్‌లాంటి చిన్న దేశాలకు భయపడాల్సి వచ్చిందని, నేడు ప్రపంచంలో అతిపెద్ద ఆయుధ సంపత్తి కలిగిన దేశంగా ఎదుగుతోందని తెలిపారు. పాకిస్థాన్ సైన్యం అభినందన్‌ను అరెస్ట్ చేస్తే 24 గంటల్లోనే దేశానికి తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఎయిర్‌పోర్టులో అబ్దుల్‌కలాం, మోదీని అమెరికా అవమానించిందని, అలాంటి అమెరికా.. మోదీ ప్రధాని అయ్యాక సెనేట్‌లో మాట్లాడుతుంటే అనేకమార్లు చప్పట్లతో స్వాగతించిందన్నారు. కేసీఆర్ పార్టీ త్వరలోనే కనుమరుగు కావడం ఖాయమని, ఆయన చేసిన పాపాలు ఆయనకే తగులుతున్నాయని జోస్యం చెప్పారు. ఎమ్మెల్సీగా ప్రేమేందర్‌రెడ్డిని గెలిపిస్తే చట్టసభల్లో ప్రశ్నించే గొంతుక అవుతారని తెలిపారు. సమ్మేళనంలో ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, అధికార ప్రతినిధి రాణిరుద్రమ, జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, నాయకులు రాణాప్రతాప్‌రెడ్డి, కంభంపాటి పుల్లారావు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ కాళీప్రసాదరావు, మోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఈటల

పాలిసెట్‌కు 5,121 మంది హాజరు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రామన్నపేట: జిల్లాలో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్–24 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా నుంచి 3,100 మంది బాలురకు 2,829 మంది, 2,524 మంది బాలికలకు 2,292 మంది హాజరైనట్లు జిల్లా కోఆర్డినేటర్ బైరి ప్రభాకర్ తెలిపారు. 5,624 మంది విద్యార్థులకు 5,121 మంది హాజరై.. 91.05 హాజరు శాతం నమోదైనట్లు పేర్కొన్నారు. వరంగల్, హనుమకొండ నగరాల్లో మొత్తం 12 కేంద్రాల్లో ఈ ప్రవేశ పరీక్షలు నిర్వహించినట్లు కోఆర్డినేటర్ తెలిపారు.

అధిక ధరలను అరికట్టాలి



డీఆర్‌ఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కాశోజీ సెంటర్ : అధిక ధరలకు విత్తనాలు అమ్ముతున్న షాపుల యజమానులపై వెంటనే చర్య తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంఘం నాయకులతో కలిసి డీఆర్‌ఓ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు విత్తనాల దుకాణాల వద్ద బారులు తీరుతున్నారని, దీంతో యజమానులు అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్నారని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా విత్తన వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారిందని తెలిపారు. మరికొంతమంది నకిలీ విత్తనాలు తయారు చేస్తూ రైతులకు విక్రయిస్తున్నారని, ఈ విత్తనాలతో వేసిన పంట సుమారు నాలుగు నుంచి 6 నెలల వరకు ఎలాంటి పూతకాత లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. అప్పటికే రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ధరలు, నకిలీ విత్తనాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, నాయకులు ఊరటి హంసల్‌రెడ్డి, నల్ల విజేందర్‌రెడ్డి, సిరుల రవీందర్, మొకిడే పేరయ్య పాల్గొన్నారు.

నిట్‌లో కృష్ణా రివర్ బేసిన్ స్టడీ సెంటర్



స్టడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్

కాజీపేట అర్బన్ : వరంగల్ నిట్‌లో కృష్ణా రివర్ బేసిన్ స్టడీ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఐఐటీ కాన్పూర్‌లోని సీ గంగా అండ్ ఎమిరిటస్ ప్రొఫెసర్ వినోద్ థారే, నిట్ వరంగల్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ సంయుక్తంగా ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జలవనరుల, నది అభివృద్ధి, గంగా పునరుజ్జీవన శాఖ సౌజన్యంతో సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కృష్ణానది సమగ్ర పరిస్థితిని అంచనా వేయడంతోపాటు పునరుద్ధరణ, నిర్వహణకు ప్రణాళికలను సిద్ధం తదితర అంశాల అధ్యయనానికి సెంటర్ తోడ్పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఐఐటీ కాన్పూర్, నిట్ వరంగల్, సూరత్‌కల్ కన్సార్టియంలు పరస్పరం ఒప్పందం కుదుర్చుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ రివర్ కన్జర్వేషన్ డైరెక్టరేట్ జాయింట్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్ అగర్వాల్, ఎన్సీడీ డైరెక్టర్ అశోక్‌బాబు, సైంటిస్ట్ శ్రీవాత్సవ, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటర్ సప్లిమెంటరీ'కి 71 మంది గైర్హాజరు

కాశోజీ సెంటర్ : జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు 71 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ కె.మాధవరావు తెలిపారు. జనరల్ కోర్సుల్లో మొత్తం 1,132 మంది విద్యార్థులకు 1,067 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. అదేవిధంగా ఒకేషనల్ కోర్సుల్లో 85 మంది విద్యార్థులకు 79 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య

నర్సంపేట: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ కాంటాల్లో ఆలస్యం జరగొద్దని, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఇప్పటి వరకు 50 శాతం ధాన్యం సేకరించి మిల్లులకు పంపినట్లు తెలిపారు. వర్షంతో తడిసిన ధాన్యాన్ని వంద శాతం కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రెయినీ ఐఎఫ్‌ఎస్ రేవంత్‌చంద్ర, డీఆర్డీఓ కౌసల్యాదేవి, డీసీఎస్‌ఓ శివప్రసాద్‌రెడ్డి, డీఎం సంధ్యారాణి, జిల్లా కోఆపరేటివ్ అధికారి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం..

ఖానాపురం: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. తేమ శాతం, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా 1010 రకాన్ని కామన్ కింద తీసుకోవడంతో క్వింటాలుకు రూ.20 నష్టపోతున్నామని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. ఖరీఫ్‌లో ఏ రకం పంట వేయాలో ముందే చెప్పాలని, ప్రస్తుతం దొడ్డు రకాలు సాగు చేసి రూ.500 బోనస్‌ను నష్టపోయామని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 52వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించినట్లు తెలిపారు. మిగిలిన 50 శాతం ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యంలో కోతలు విధించినా, రైతులను ఇబ్బందులు పెట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 10 లోపు పూర్తిస్థాయిలో దుస్తులు అందిస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట ట్రెయినీ ఐఎఫ్‌ఎస్ అధికారి రేవంత్‌చంద్ర, డీఆర్డీఓ కౌసల్యాదేవి, డీసీఎస్‌ఓ శివప్రసాద్‌రెడ్డి, సివిల్ సప్లయాస్ డీఎం సంధ్యారాణి, డీసీఓ సంజీవరెడ్డి, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.



నర్సంపేట : వ్యవసాయ మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య



నర్సంపేట రూరల్ : మహేశ్వరంలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న కలెక్టర్

కుట్టు మిషన్ కేంద్రం పరిశీలన

నర్సంపేట రూరల్ : మహేశ్వరంలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళాశక్తి కుట్టు మిషన్ కేంద్రాన్ని కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ఈసెంటర్ పరిధిలోని గ్రామాల పాఠశాలల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది యూనిఫాం కుట్టించుకున్నారు, రోజుకు ఎన్ని డ్రెస్సులు కుడుతున్నారని ఆరా తీశారు. రోజుకు ఐదు చొప్పున డ్రెస్సులు కుడుతున్నామని మహిళలు తెలిపారు. 95 మంది బాలికలు, 106 మంది బాలురు ఉన్నారన్నారు. అనంతరం హేమ్లతండా, రంగంపల్లి విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ట్రెయినీ ఐఎఫ్‌ఎస్ రేవంత్‌చంద్ర, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, అదనపు డీఆర్‌డీఓ రేణుకాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ రత్నమాల, డీపీఎం దయాకర్ ఉన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పరిశీలన



ఆస్పత్రిని పరిశీలిస్తున్న అధికారులు

హన్మకొండ: వరంగల్ కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఎన్పీడీసీఎల్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఎన్పీడీసీఎల్ సీజీఎం కె.కిషన్, వరంగల్ ఎస్ఈ పి.మధుసూదన్‌రావు, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్, ఏడీ పి.శ్రీనివాస్‌రెడ్డి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చేరుకుని విద్యుత్ సరఫరా జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ దీపక్‌తో విద్యుత్ సరఫరాపై చర్చించారు. సమస్యలు తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే సమాచారమివ్వాలని, ఆస్పత్రిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

- జిల్లాకు 1,246 క్వింటాళ్ల జీలుగ సీడ్స్

ఖిలా వరంగల్: ప్రభుత్వం సబ్సిడీపై జీలుగ విత్తనాలను అందిస్తోంది. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో అందుబాటులో ఉంచింది. సేంద్రియ పద్ధతిని ప్రోత్సహిస్తూ వరి పంట అధిక దిగుబడి వచ్చేందుకు వ్యవసాయశాఖ పంపిణీ చేస్తోంది. ఏకవార్షిక మొక్కల్లో ప్రథమ స్థానం జీలుగదే. విత్తనాలు విత్తిన 30 నుంచి 35 రోజుల్లో మొక్కలు ఏపుగా పెరుగుతాయి. దుక్కిలో 30 కిలోల యూరియా వేసిన తర్వాత ఎకరానికి 12 కిలోల జీలుగ విత్తనాలు చల్లుకోవాలి. 30 రోజుల్లో ఏపుగా పెరిగి పూత దశకు చేరుకుంటుంది. ఆ సమయంలో మొక్కలను మొదళ్ల వద్ద కత్తిరించాలి. లేనిపక్షంలో రోటోవేటర్ సాయంతో పొలం అంతా కలియదున్నాలి. దున్నిన అనంతరం 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ ఎరువును దుక్కిలో వేస్తే మొక్కల అవశేషాలు బాగా కుళ్లి పచ్చిరొట్ట ఎరువు తయారవుతుంది. పొలంలో జీలుగ కుళ్లే దశలో నీటిని సక్రమంగా అందించాలి.

60 శాతం రాయితీపై పంపిణీ..

జిల్లాకు 1,246 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా అయ్యాయి. ప్రభుత్వ 60 శాతం రాయితీపై ఇస్తోంది. జీలుగ క్వింటాలు ధర రూ.9,300 కాగా.. రూ.5,580 రాయితీ తీసివేస్తే రైతు రూ.3,720 చెల్లించాల్సి ఉంటుంది. జీలుగ 30 కిలోల బస్తాకు 60 శాతం రాయితీ తీసివేస్తే రైతు రూ.116 చెల్లించాలి. 30 కిలోలు రెండున్నర ఎకరాల విస్తీర్ణానికి సరిపోతుంది.



జీలుగ పంట (ఫైల్)

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం 60 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను అందిస్తోంది. 1,246 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మండల కేంద్రాల్లోని పీఏసీఎస్‌ల లో అందుబాటులో ఉన్నాయి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

డి.ఉషాదయాళ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

క్లుప్తంగా

రైల్వే ఉద్యోగుల సీసీఎస్ రుణాల పెంపు

కాజీపేట రూరల్: రైల్వే కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (లిమిటెడ్) సీసీఎస్ (రైల్వే ఉద్యోగులు) సభ్యుల రుణాలు పెంచుతూ డైరెక్టర్ల మీటింగ్‌లో తీర్మానించినట్లు కాజీపేట రైల్వే సీసీఎస్ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్ యాదవ్, కాజీపేట రైల్వే సీసీఎస్ కో ఆప్షన్ డైరక్టర్ దేవులపల్లి రాఘవేందర్ శుక్రవారం తెలిపారు. సికింద్రాబాద్ సీసీఎస్ ముఖ్య కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సీసీఎస్ డైరెక్టర్ల బోర్డు మీటింగ్‌లో రుణాలను పెంచుతూ కమిటీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కాజీపేట నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీనివాస్‌యాదవ్, రాఘవేందర్ ఈ మీటింగ్‌లో పాల్గొన్నారు. సీసీఎస్ సభ్యులకు ప్రస్తుతం ఇస్తున్న జనరల్ లోన్ రుణం రూ.3లక్షలను రూ.4లక్షల వరకు, స్పెషల్ లోన్ రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. పెంచిన రుణాలను జూలై 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నామని, రుణాల వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- భార్య పుట్టింటికి వెళ్లి రాకపోవడంతో ఘటన
- ఏడాదిక్రితం ప్రేమవివాహం చేసుకున్న జంట


నితిన్ మృతదేహం

హసన్‌పర్తి: కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నగరంలోని ఒకటో డివిజన్ పలివేల్పుల ఆనంద్‌నగర్ కాలనీలో శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పలివేల్పులకు చెందిన గోలి నితిన్(25) నర్సంపేటకు చెందిన ఓ యువతి ప్రేమించుకుని ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి కాపురం కొంత కాలం సవ్యంగానే సాగినా.. అనంతరం గొడవలు ప్రారంభమయ్యాయి. ఇటీవల భర్తతో గొడవ పడిన భార్య పుట్టింటికి వెళ్లింది. భార్య తిరిగి రావడం లేదని మనస్తాపానికి గురైన నితిన్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీకి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.



అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలు

- కాజీపేట రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు తనిఖీ చేసిన డీఆర్ఎం భర్తీష్‌కుమార్

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ప్రారంభించిన అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం అభివృద్ధి పనులు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో చేపడుతున్నట్లు సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) భర్తీష్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. కాజీపేట జంక్షన్‌లో చేపట్టిన వరల్డ్‌క్లాస్ అమృత్ భారత్ రైల్వే స్టేషన్ స్కీం అభివృద్ధి పనులను శుక్రవారం డీఆర్ఎం తనిఖీ చేశారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే వెయిటింగ్ హాల్స్, టాయ్‌లెట్స్, విశ్రాంతి గదులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జితోపాటు జంక్షన్ ఎదుట ఉన్న సర్క్యులేటింగ్ ఏరియాలో జరుగుతున్న పనులను ఆయన తనిఖీ చేసి పనుల నిర్మాణం, నాణ్యత ప్రమాణాలపై అధికారులతో మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగిస్తున్న కార్యాలయాలు, నూతన నిర్మాణాలను పరిశీలించి పలు చోట్ల మార్పులు, చేర్పులపై, వర్షం నీరు నిల్వకుండా ఉండేందుకు అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఏడీఆర్ఎం గోపాల్, వివిధ విభాగాల అధికారులు ఉన్నారు.


జనగామ రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం భర్తీష్‌కుమార్ జైన్


కాజీపేట జంక్షన్‌లో అధికారులకు సూచనలిస్తున్న డీఆర్ఎం

జనగామ రైల్వేస్టేషన్‌లో పనుల పరిశీలన

జనగామ: కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్కీంలో భాగంగా జనగామ రైల్వేస్టేషన్ ఆధునీకీకరణకు సుమారు రూ.107కోట్ల వరకు బడ్జెట్ కేటాయించగా, మొదటి విడుత రూ.27 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. శుక్రవారం డీఆర్ఎం భర్తీష్‌కుమార్ జైన్ జనగామ రైల్వేస్టేషన్‌లో పనుల పురోగతిని పరిశీలించారు. లక్ష్యం మేరకు పనులు పూర్తి కావాలని ఆదేశించారు. పార్కింగ్, గ్రీనరీ, తదితర వాటికి సంబంధించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కేసీఆర్ కుటుంబమే పెద్ద బ్లాక్‌మెయిలర్

- రాష్ట్ర మంత్రి సీతక్క


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు: కేసీఆర్ కుటుంబం కంటే పెద్ద బ్లాక్‌మెయిలర్ రాష్ట్రంలో ఎవరూలేరని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. ములుగు మండలం ఇంచర్ల సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశంలో సీతక్క మాట్లాడారు. తాను ఎక్కడ మోసం చేశానో తనపై ఆరోపణలు చేస్తున్న దుర్మార్గులు, దోపిడీదారులు నిరూపించాలని సవాల్ విసిరారు. ఆదివాసీ మహిళ మంత్రిగా ఉండడాన్ని చూసి తట్టుకోలేకపోతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి సన్నాలుకు బోనస్ ఇస్తున్నామని, ఇక ముందు దొడ్డురకానికి కూడా ఇస్తామని తెలిపారు. 'పక్కదేశంలో చదువుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి గొప్పోడా.. మన మధ్యలో ఉంటూ ప్రజలు, నిరుద్యోగుల సమస్యలపై నిత్యం పోరాడుతున్న తీన్మార్ మల్లన్న గొప్పోడా..' అని సమావేశానికి వచ్చిన పట్టభద్రులను అడిగి సమాధానం రాబట్టారు. మల్లన్నను అర్ధరాత్రి అరెస్టు చేసి, కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేసినా ప్రశ్నించడం మానుకోలేదని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. ప్రతి విషయంలో ప్రశ్నించి అడ్డుతగులుతున్నాడని నన్ను అరెస్ట్ చేయించావు, మరి ఇప్పుడు నీ చెల్లి కవితమ్మ ఎందుకు అరెస్ట్ అయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి తీన్మార్ మల్లన్న అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టారో రాకేశ్‌రెడ్డికే తెలియదని, దుర్గమ్మ గుడిచుట్టూ మేకను తిప్పినట్లు అతన్ని తిప్పుతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో మాజీ ఎంపీ పోరిక బలరాంనాయక్, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య, నాయకులు కూచన రవళి, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బానోత్ రవిచందర్, రాంరెడ్డి, రవి, వెంకటనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో నూతన వంగడాలు


రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఉమారెడ్డి, ఉషాదయాళ్

హన్మకొండ: రైతులకు అవసరమైన నూతన వంగడాలు అందుబాటులో ఉన్నాయని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు. వరంగల్ పైడిపల్లిలోని వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం నిర్వహించిన విత్తన మేలాలో ఉమారెడ్డి మాట్లాడారు. అధిక దిగుబడులు ఇచ్చే, చీడపురుగులను తట్టుకునే నూతన వరి, కంది, పెసర విత్తనాలు వ్యవసాయ పరిశోధన స్థానంలో అందుబాటులో ఉన్నాయన్నారు. పంటల అవశేషాలు కాలపెట్టకుండా భూమిలోనే కలియదున్నాలని, పచ్చిరొట్ట పంటలను వేసుకుని భూసారాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్తలు వి.వెంకన్న, జి.వీరన్న, ఎన్.సంధ్య కిశోర్ మాట్లాడారు. వరిలో నేరుగా విత్తే పద్ధతి ద్వారా రైతులు సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. పత్తి పంటలో అధిక సాంద్రత కలిగిన పత్తి ద్వారా మంచి లాభాలు సాధించవచ్చని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పంట మార్పిడి విధానం ద్వారా మేలు జరుగుతుందన్నారు. పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విస్తీర్ణం పెంచాలని సూచించారు. వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన విత్తనాలు గుర్తింపు పొందిన డీలర్ వద్దనే తీసుకోవాలని, వాటికి సంబంధించిన రశీదు, ఇతర వివరాలు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. జీలుగ విత్తనాలు రైతులకు రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. రైతులు పంట బీమా చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు విత్తనాలు అందించి, రైతులకు అవసరమైన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ దిలీప్ కుమార్, వ్యవసాయ శాఖ హనుమకొండ ఏడీ దామోదర్ రెడ్డి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, పురుగు మందులను అరికట్టాలి

వరంగల్: రైతులు సాగుకు సిద్ధమవుతున్న ప్రభుత్వ అనుమతిలేని, కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులను రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకునే ప్రయత్నాలు చేస్తున్న వ్యాపారులు, ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు కోరారు. శుక్రవారం తెలంగాణ రైతు సంఘం నాయకులు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను కలసి వినతి పత్రాలను అందజేసి, మాట్లాడారు. గత సంవత్సరం విక్రయించగా మిగిలిన బ్రాండెడ్ కంపెనీల విత్తనాలను అదే కంపెనీల పేరుతో ఇప్పుడున్న లాట్ నంబర్ వేస్తూ ప్యాకింగ్ చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. బ్రూతఫుల్ లేబుళ్లను ప్యాకింగ్‌లపై అంటించి అమ్మకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పైరు ఏపుగా పెరుగుతుందని, దిగుబడి బాగా వస్తుందనే నమ్మించి అనుమతి లేని బయో మందులను సైతం రైతులకు అంటగడుతున్నారని అలాంటివారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించి పోలీస్ శాఖలోని నిఘా వర్గాలు, వ్యవసాయ శాఖ అధికారులను అప్రమత్తం చేసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వ్యాపారుల హోల్‌సేల్, రిటేల్ దుకాణాల్లో, సరుకులు నిల్వలు ఉండే గోదాముల్లో తనిఖీలు చేపట్టి రైతులు మోసపోకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, ససంపత్‌కుమార్, నర్సయ్య, గోపాలరావు, ఆనందరావు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించుకుందాం

- కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్


న్యూరాయపురలో ప్రచారంలో పాల్గొన్న రవీందర్‌సింగ్

హన్మకొండ చౌరస్తా: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రభుత్వాన్ని ప్రశంసించే వ్యక్తిని కాకుండా ప్రశ్నించే గొంతుకను గెలిపించుకుందామని కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ పట్టభద్రులను కోరారు. హనుమకొండలోని కాకతీయ కాలనీ, కార్పొరేషన్ సర్కిల్, న్యూ రాయపుర ప్రాంతాలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి గత బీఆర్ఎస్ సర్కార్ ఇచ్చిన సంక్షేమ పథకాలను పక్కన పెట్టిందని అన్నారు. తీన్మార్ మల్లన్న.. చోర్ మార్‌గా.. మారి ప్రభుత్వాన్ని ప్రశంసించే గొంతుగా మారాడని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్, అనిల్, పాషా, చిరంజీవి, జనార్దన్‌గౌడ్, తుల రమేశ్, శీలం ప్రవీణ్, గోపిరెడ్డి రాజు, అనురాం తదితరులు పాల్గొన్నారు.

పోరాడే నాయకుడు ప్రేమేందర్‌రెడ్డి

- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్


సమావేశంలో మాట్లాడుతున్న కె.లక్ష్మణ్

రామన్నపేట: గత 40 సంవత్సరాలుగా నీతి, నిజాయితీతో ప్రజల కోసం పనిచేస్తూ, నిరుద్యోగుల సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకైన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా దేశాయ్‌పేట కేఆర్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలో పట్టభద్రులు ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, ఎన్నికల ఇన్‌చార్జ్ పీఎల్ శ్రీనివాస్, కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రత్నం సతీష్ షా, బాకం హరిశంకర్, వన్నాల వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యేలు రాజేశ్వర్‌రావు, వన్నాల శ్రీరాములు, అల్లం నాగరాజు, కార్పొరేటర్లు కల్పన, స్వాతి, రంజిత్ పాల్గొన్నారు.

ప్రదీప్‌రావు ఇంటికి లక్ష్మణ్

కాశిబుగ్గ: నగర పర్యటనకు వచ్చిన లక్ష్మణ్ ఓ సిటీలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు, రేణుక దంపతులు ఆయనకు స్వాగతం పలికి జ్ఞాపిక అందజేసి శాలువాతో సన్మానించారు.

జిల్లాల్లో క్రికెట్ అసోసియేషన్లను సంప్రదించాలి


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నయీంనగర్: తెలంగాణ జిల్లాలలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌ను సంప్రదించకుండా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధికారులు ఏ చర్యలకు ఉపక్రమించినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని టీసీఏ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఝొండల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి, కోశాధికారి డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి హెచ్చరించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్ తప్ప ఏనాడు తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి కృషి చేయని హెచ్‌సీఏ ఇప్పుడు జిల్లాల్లో స్టేడియాలను నిర్మాణం చేస్తామనడం బూటకమన్నారు. ఇన్ని సంవత్సరాలు జిల్లాల పేరు చెప్పి బీసీసీఐ నుంచి వందల కోట్ల రూపాయలు తీసుకుని అవినీతికి పాల్పడిన హెచ్‌సీఏ పాలకమండలి బాధ్యత వహిస్తుందా.. అని ప్రశ్నించారు. హెచ్‌సీఏలో గత 5ఏండ్లుగా లెక్కలు, ఫోరెన్సిక్ ఆడిట్ చేయలేదని, రంజీ ట్రోఫీలలో 24వ స్థానానికి పడిపోయిందని తెలిపారు. పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిన హెచ్‌సీఏ క్రికెట్ అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు. వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి జైపాల్, సమీర్, నవరసం, ఆదిత్య, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌మెయిల్ చేసిన వ్యక్తికి కమ్యూనిస్టుల మద్దతా?

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ


విలేకరులతో మాట్లాడుతున్న రాణి రుద్రమ

హన్మకొండ: యూ ట్యూబ్ చానల్‌ను అడ్డు పెట్టుకుని బ్లాక్ మెయిల్ చేసిన వ్యక్తి తీన్మార్ మల్లన్న కమ్యూనిస్టులు ఎలా మద్దతు ఇస్తారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ ప్రశ్నించారు. శుక్రవారం హనుమకొండలోని బీజేపీ ఎన్నికల కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీనియర్ నాయకుడు రాఘవులు అవినీతికి పాల్పడ్డారని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వద్ద రూ.100 కోట్లు తీసుకుని 10 టీవీ చానల్‌ను ధారాదత్తం చేశారని తీన్మార్ మల్లన్న యూట్యూబ్ ద్వారా ప్రచారం చేశారని, ఈ ఆరోపణలకు ఆధారాలు చూపించాడా..? లేక తీన్మార్ మల్లన్న బ్లాక్ మెయిల్‌కు భయపడి మద్దతు ఇస్తున్నారా.. అనేది సమాజానికి చెప్పాలన్నారు. బ్లాక్ మెయిల్ చేసి మీ అవినీతి సొమ్ము నుంచి తీసుకున్న మొత్తాన్ని సీఎం రేవంత్‌కు ఇచ్చి టికెట్ తెచ్చుకున్నారా అని ప్రశ్నించారు. తాను కూడా కేటీఆర్ వద్ద డబ్బులు తీసుకుని స్థలం కొన్నానని ఆ చానల్ ద్వారా ప్రచారం, ఆరోపణ చేస్తే ఆధారాలు చూపించాలని, లేకపోతే చెప్పుతో కొడతానని హనుమకొండ చౌరస్తాలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది జరిగి మూడేళ్లయినా ఆధారాలు చూపించలేదన్నారు. విజ్ఞులైన పట్టభద్రులు ఆలోచించాలన్నారు. ప్రజల పక్షాన పోరాడే బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు తాళ్లపల్లి కుమారస్వామి, కొండి జితేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రాజిరెడ్డి, నర్మెట శ్రీనివాస్ పాల్గొన్నారు.

మనువాద రాజకీయాలతో రాజ్యాంగానికి ముప్పు

- సామాజిక విశ్లేషకులు భిక్షమయ్య


సదస్సులో మాట్లాడుతున్న బొజ్జ భిక్షమయ్య

నయీంనగర్: మనువాద రాజకీయాలతో రాజ్యాంగానికి ప్రమాదం ఉందని సామాజిక విశ్లేషకులు బొజ్జ భిక్షమయ్య అభిప్రాయపడ్డారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం రాజ్యాంగ పరిరక్షణ సదస్సు ఫోరమ్ కన్వీనర్ ప్రొ.ఎర్రగట్టుస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన వక్త బొజ్జ భిక్షమయ్య మాట్లాడుతూ.. ఒకే దేశం, ఒకే మతం, ఒకే సంస్కృతి అన్న నినాదమే మోసపూరితమైందన్నారు. బలహీనవర్గాలు, వెనుకబడిన మైనార్టీలకు రిజర్వేషన్లు ఉండకుండా కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టసభలు 90రోజులు నడవాలని కాని 15రోజులే నడుస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ ప్రీతి దయాళ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం రద్దు అయితే దేశంలో ప్రజాస్వామ్యం రద్దు అవుతుందన్నారు. ప్రొఫెసర్ వెంకటనారాయణ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజ్యాంగం మార్చాలనే వాళ్లను ఓడించాలని, ప్రజల గొంతుకగా నిలిచిన తీన్మార్ మల్లన్నను గెలిపించాలని గ్రాడ్యుయేట్లను కోరారు. ఈ సదస్సులో వివిధ సంఘాల నాయకులు రామబ్రహ్మం, ప్రొఫెసర్ వీరన్న, ఎండీ.రియాజ్, కత్తి వెంకటస్వామి, బదావత్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమైంది.. అందుకే చనిపోతున్నా

- కుటుంబ సభ్యులకు వీడియో కాల్‌చేసి ఆత్మహత్య


బాదావత్ నవీన్ మృతదేహం

గూడూరు: 'నాప్రేమ విఫలమైంది. అందుకే చనిపోతున్నా' అంటూ ఓ యువకుడు తన కుటుంబ సభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడి ఆ తరువాత ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చెర్ల శివారు కొమురం భీంనగర్ అటవీప్రాంతంలో శుక్రవారం జరిగింది. పోలీసులకు మృతుడి తండ్రి కీర్యానాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట డివిజన్ ఖానాపురం మండలం నాజీతండాకు చెందిన బాదావత్ నవీన్ (25) ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. కానీ ఆ యువతి ఇటీవల నవీన్ ప్రేమను కాదంటుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో అతను గురువారం ఉదయం నాజీతండా నుంచి బయలుదేరి గూడూరు మండలం మచ్చెర్ల శివారు కొమురంభీంనగర్ అటవీ ప్రాంతానికి చేరుకున్నాడు. తన ప్రేమ విఫలమైందని, అందుకు తాను పురుగుల మందు తాగి చనిపోతున్నట్లు కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి చెప్పాడు. ఆ తరువాత పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే నాజీతండా నుంచి బయలుదేరి అడవికి చేరుకోగా నవీన్ అపస్మారకస్థితిలో పడి ఉండడాన్ని గమనించారు. వెంటనే గూడూరు సీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తండ్రి కీర్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్టేషన్‌కు పిలిచి చిత్రహింసలు పెడుతున్నారు


పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న గుగులోతు బోజ్యా

సాక్షి, మహబూబాబాద్: పోలీస్ స్టేషన్‌కు పిలిచి చిత్రహింసలు పెడుతున్నారని మానుకోట జిల్లాలోని కొత్తగూడ మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన గుగులోతు బోజ్యా ఆరోపించాడు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో విలేకర్లతో మాట్లాడాడు. అసెంబ్లీ ఎన్నికల ముందు రెండు బస్తాల దొడ్డు బియ్యం విక్రయించడానికి ద్విచక్రవాహనంపై నర్సంపేటకు తీసుకెళ్తుండగా కొత్తగూడ ఎస్సై గువ్వలబోడు వద్ద పట్టుకుని బండిని సీజ్ చేసి కొట్టాడు. వారం రోజుల తర్వాత పిలిచి మళ్లీ కొట్టాడు. పీడీఎస్ బియ్యం అమ్ముకుంటున్నట్లు కేసు పెట్టి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి మరోసారి బియ్యం విక్రయానికి పాల్పడొద్దని చెప్పి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. ఈరోజు(శుక్రవారం) మళ్లీ మాట్లాడాలని స్టేషన్‌కు పిలిచాడు. భయంతో గ్రామపెద్దలను తీసుకుని వెళ్లాను. పెద్దమనుషులను బయట కూర్చోమని చెప్పి నన్ను ఎస్సై మళ్లీ కొట్టాడు. ఇలా మాటిమాటికి పిలిచి కొడుతున్నాడని బోజ్యా తెలిపారు. ఇదే విషయమై ఎస్సై దిలీప్‌ని వివరణ కోరగా తాను ఎవరిని చిత్రహింసలకు గురి చేయలేదని తెలిపారు. బియ్యం ఎక్కడికి తరలిస్తున్నారో తెలుసుకునేందుకు విచారిస్తుండగా తనపై కావాలని ఆరోపణలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తేలుకాటుతో బాలుడి మృతి


కిషన్‌సింగ్ మృతదేహం

ఎల్కతుర్తి: ఆరబోసిన ధాన్యంపై కప్పిన పరద తీస్తుండగా ఓ బాలుడికి తేలు కుట్టడంతో మృతిచెందాడు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఠాగూర్ కిషన్‌సింగ్(13) తన తండ్రి ఠాగూర్ శ్యామ్‌సింగ్‌తో కలిసి గ్రామ శివారులో ఆరబోసిన వరిధాన్యంపై కప్పిన పరదను తీస్తున్న క్రమంలో తేలు కాటువేసింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం 108వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

రిజిస్ట్రేషన్లు సులభతరంగా చేపట్టాలి

- జాయింట్ ఐజీ మధుసూదన్‌రెడ్డి


మధుసూదన్‌రెడ్డి, సుభాషిణిని సత్కరిస్తున్న రవి, అమ్జద్

కాజీపేట అర్బన్: భూక్రయవిక్రయదారులకు సులభతరంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ జాయింట్ ఐజీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శుక్రవారం వార్షిక తనిఖీలో భాగంగా జాయింట్ ఐజీ మధుసూదన్ రెడ్డి రిజిస్ట్రేషన్, చిట్స్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ కార్యాలయంలో జాయింట్ ఐజీ మధుసూదన్‌రెడ్డి, డీఐజీ సుభాషిణిని జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి, సబ్ రిజిస్ట్రార్ అమ్జద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు.

విద్యుత్ షాక్‌తో డిగ్రీ విద్యార్థి దుర్మరణం


కరుణాకర్ (ఫైల్)

లింగాలఘణపురం: కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు కూలిపనులకు వెళ్లిన డిగ్రీ విద్యార్థి విద్యుత్ షాక్‌తో మృతిచెందిన విషాదకర ఘటన జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన గట్టగల్ల ప్రమీల ఆగమల్లయ్య చిన్న కుమారుడు, డిగ్రీ విద్యార్థి గట్టగల్ల కరుణాకర్ (21)భవన నిర్మాణపనులకు కూలీగా వెళ్లాడు. ఈ నేపథ్యంలో మేస్త్రీ గట్టగల్ల నర్సయ్య పటేల్‌గూడెంలో బండ శ్రీశైలం ఇంటి నిర్మాణ పనులు చేపడుతుండగా కరుణాకర్ రోజువారీ కూలీగా వెళ్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం యథావిధిగా పనికి వెళ్లి సిమెంట్, ఇసుక కలిపేందుకు సంప్‌లో నుంచి నీరు పెట్టేందుకు మోటార్ ఆన్ చేసి, తిరిగి బంద్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఉన్నత చదువులు చదివి ప్రయోజకుడు అవుతాడని భావించిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

- ప్రిన్స్ రియల్‌ఎస్టేట్: వరంగల్ గొర్రెకుంటలో కీర్తినగర్ ప్రక్కన, RTC కాలనీలో గల 130 గజాలలో రేకుల ఇల్లు అమ్మబడును. ధర కేవలం 16 లక్షలు మాత్రమే. కీర్తినగర్ కాలనీలో ఇల్లు అమ్మబడును. మావద్ద ప్లాట్స్ అమ్మబడును. సెల్: 9989388603. [W-1242468]
- WGL, కొత్తవాడ, లక్ష్మి గార్డెన్స్ దగ్గర 182 గ.ల E/F ఇల్లు G.F 1 BHK + 2 BHK, 1st ఫ్లోర్ 2 BHK + 2 BHK, 2nd ఫ్లోర్ 1 BHK పార్కింగ్ G.F. కార్ @ 3 bikes, 1 బోర్, WMC వాటర్ # 9490421153, 9652979107. [M-11664]

SERVICES

BUSINESS OFFER

- వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును. CIBIL అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. హన్మకొండ. సెల్: 8096520976. [WA-5708]

FINANCE

- హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1242459]

WANTED

- హనుమకొండ, లష్కర్‌బజార్, పబ్లిక్ గార్డెన్ దగ్గర ఉన్న HP పెట్రోల్‌పంప్ నందు పెట్రోల్, డీజిల్ క్యాషియర్ & ఫిల్లర్స్‌గా ఫిల్లింగ్ పని చేయుటకు యువతీ యువకులు కావలెను. (8గం./12గం./24గం.) సంప్ర: 9505919293. [W-1200892]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185087]
- మహబూబాబాద్ జిల్లాలో వేప పిండి, ఆముదం పిండి అమ్ముటకు అర్జంటుగా ఏజెంట్లు కావలెను. ఆర్గానిక్ ఆయిల్స్ సేల్స్ కొరకు ఏజెంట్లు కావలెను. 7842728053. [Y-798453]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

WANTED TEACHERS

- Wanted Lady Teachers (E/M) Pre-Primary All Subjects. 1st- 5th English, Hindi, Telugu. 6th-10th Maths & Social. Indian Kids High School, SVN Road, WGL. 9963006221. [W-1242469]
- V. Principal -2, 3rd-10th All Sub. Teachers, Incharges-2, Receptionists-4, Accounts-2, PET-6, Wardens (M/F) -10. # ISHS, Ambala Road, Near: Kits © 9177039449. [W-1242408]
- Pre-Primary Mother & Helping Teachers, 1 to X all subject Teachers are required. Space High School, Jawahar Colony, Gopalpur. Cell: 9177710222. [W-1242407]
- We are Recruiting Exp./ Fresher Teachers to teach for the classes KG to 10th (E/M) for all Subjects & Non-Teaching Staff. Qlf: Good Spoken English and Passion for Teaching. Interviews @ 26-05-2024 from 9:00 to 5:00 PM. Abhyasa the School, Ganesh Nagar, Shambhunipet, Warangal. Cell: 9989398399, 8885398399. [W-1264970]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.